

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు'

తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | శనివారం 26 సెప్టెంబరు 2026 | సంపుటి : 01, సంచిక : 05 | పేజీలు : 04, వెల రూ.2

శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం



శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సవిత అన్నారు. కార్ల పరిశ్రమ దగ్గర నుంచి గగన తలంలో ఎగిరే విమానాల పరిశ్రమలు సత్యసాయి జిల్లాకి రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని చెప్పుకొచ్చారు.

శ్రీ సత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 25: శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి అన్నారు. కార్ల పరిశ్రమ దగ్గర నుంచి గగన తలంలో ఎగిరే విమానాల పరిశ్రమలు సత్యసాయి జిల్లాకి రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టమని చెప్పుకొచ్చారు. ఈరోజు(శుక్రవారం)జిల్లాలోని మిగతా..2లో

తెలంగాణలో ముగిసిన నైరుతి సీజన్ వర్షాలు..రేపటి నుంచి దంచికొట్టనున్న ఎండలు!



తెలంగాణలో వాతావరణం మారిపోనుంది. రాష్ట్రంలో తీవ్ర వాయుగుండం ప్రభావం పూర్తిగా ముగిసిందని, ఈ సీజన్‌కు సంబంధించి నైరుతి రుతుపవనాల ప్రధాన వర్షాలు దాదాపుగా ముగిసినట్లేనని ప్రముఖ వాతావరణ నిపుణుడు 'తెలంగాణ వెదర్‌మ్యాన్' తన తాజా ట్వీట్‌లో వెల్లడించారు.

సెప్టెంబర్ 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు గణనీయంగా తగ్గిపోయి, పొడి వాతావరణంతో పాటు తీవ్రమైన ఉక్కపోత మొదలవుతుందని స్పష్టం చేశారు. అక్కడక్కడా చెదురుమదురు జల్లులు మినహా చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణమే కొనసాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 2 వరకు తెలంగాణ అంతటా ఎండల తీవ్రత పెరిగే అవకాశముంది. మిగతా..2లో

నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు.. 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం



- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల
- ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్టు వెల్లడి

అమరావతి :ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని నవంబర్ 1న ప్రారంభించనున్నట్లు

అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట

వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు

- గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు.
- పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో
- అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది.
- గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట



అమరావతి: : గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. క్లీన్ ఎనర్జీ నుంచి ఫార్మా, ఇండస్ట్రియల్ పార్కులు, ఎడిబుల్ ఆయిల్స్, టైర్ల తయారీ వరకు ఏపీని కొత్త పెట్టుబడుల హబ్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. టొరెంట్, వెల్‌స్పన్, గోకుల్ ఆగ్రోస్, చిరిపాల్ గ్రూపులతో జరిగిన వరుస భేటీల్లో భారీ విస్తరణలకు రాష్ట్రాన్ని ఎంచుకోవాలని ఆహ్వానించారు. పెట్టుబడుల అవకాశాలపై ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఆయా సంస్థల ప్రతినిధులు హామీ ఇవ్వడంతో అహ్మదాబాద్ వేదికగా పారిశ్రామిక భాగస్వామ్యాలకు కొత్త బాట పడింది. అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేశ్ వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహిస్తూ సుడిగాలి పర్యటన చేపట్టారు. టొరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, డైరెక్టర్లు షాన్ మెహతా, జిగీష్ మెహతాలతో జరిగిన చర్చల్లో ఫార్మా రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వైజాగ్ ప్లాంట్ బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌లో భాగంగా ఏపీఐలు, అధునాతన ఇంటర్మీడియట్ల తయారీ సామర్థ్యాలను విస్తరించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ మిగతా..2లో

ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం



- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం

అమరావతి : తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు. క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు మిగతా..2లో

బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు



- ఎస్ ఐఆర్ వివాదంపై బీజేపీ సాకులు చెప్పడం ఆపేయాలి: ప్రియాంక గాంధీ

ఢిల్లీ :ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియపై వివాదం చెలరేగిన నేపథ్యంలో, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ శుక్రవారం బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎస్ ఐఆర్ చేపట్టి దేశంలో 13 కోట్ల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆమె ఆరోపించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచారని అన్నారు. ఈ విషయంపై అధికార బీజేపీ ఇచ్చిన వివరణలను ఆమె తోసిపుచ్చారు. ఈ సమస్యను కేవలం ఒక రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయలేమని

మేక్ ఇన్ ఇండియాతో మార్పు స్పష్టంగా ఉంది' ప్రధాని మోదీ పోస్ట్- కాంగ్రెస్ పార్టీ కౌంటర్

- 2014లో మొదలైన మేక్ ఇన్ ఇండియాకు 12 ఏళ్లు- తయారీ, పెట్టుబడులు, ఎగుమతుల్లో మార్పు కనిపిస్తోందన్న ప్రధాని మోదీ
- ఆశించిన స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగాల పెరుగుదల లేదన్న కాంగ్రెస్



ఢిల్లీ : భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా సోషల్ మీడియాలో ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. 12 ఏళ్ల తర్వాత వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఆయన తన పోస్ట్ లో ప్రస్తావించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ, భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

'వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది'

అయితే 2014 సెప్టెంబర్ 25న ప్రధాని నరేంద్ర మోదీ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగతా..2లో

బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వడం లేదు

- అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్ కార్యక్రమంలో ప్రసంగించిన అమిత్ షా
- బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని వ్యాఖ్య
- బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి పాకిస్థాన్ మొకరిల్లాల్సి వచ్చిందన్న షా



ఢిల్లీ: బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వటం లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా బ్రహ్మోస్ క్షిపణుల ధాటికి భారత్ ముందు పాకిస్థాన్ మొకరిల్లాల్సి వచ్చిందన్నారు. శుక్రవారం, అంతర్జాతీయ ట్రేడ్ షో నాల్గో ఎడిషన్‌ను కేంద్ర హోం మంత్రి గ్రేటర్ నొయిడాలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో రక్షణ ఉత్పత్తుల తయారీ భారీగా పెరిగిందని మిగతా..2లో

కేసీఆర్ భూములపై విచారణకు ప్రత్యేక కమిటీ - 16 అంశాలతో జాబితా



- రాష్ట్రంలో భూ అక్రమాలు గుట్టు విప్పేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.
- దీనిలో 16 అంశాలతో జాబితాను రూపొందించింది.
- మాజీ సీఎం కేసీఆర్ ఇతర నేతల భూముల వివరాలను విచారణాంశాల్లో చేర్చింది.

హైదరాబాద్: భూ అక్రమాలు, ఆక్రమణల గుట్టు విప్పేందుకు శాసనసభ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. దీనికోసం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 16 అంశాలపై విచారణ చేయాలని నిర్ణయించింది. మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రులు, కేటీఆర్, హరీశ్ రావులతోపాటు వారి కుటుంబసభ్యులు, ఇంకొందరు బీఆర్ఎస్ నేతలకు సంబంధించి

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక



హైదరాబాద్: హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మిగతా..2లో

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..

మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు



- అర్హులైన ఓటర్లకూ నోటీసులిస్తున్నారని విమర్శ
- గతంలో పలుమార్లు ఓటు వేసిన వారినీ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని డిమాండ్
- అర్హులందరికీ ఓటు హక్కు ఉండాలన్న మహేశ్ గౌడ్

హైదరాబాద్: అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. పౌరులకు నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ డిమాండ్ చేసినట్టుగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. లేకపోతే వారిని ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో మిగతా..2లో

రాయలసీమ దరువు
APTEL/28/A7874
www.royaleseemadaruvu.com
తెలుగు దినపత్రిక

మొదటి పేజీ తరువాయి

ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు
మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడిది రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..
37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో పౌరసరఫరాల శాఖ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడిన ఆయన, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు, రవాణా, మిల్లింగ్ ప్రక్రియకు సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సేకరణ ప్రక్రియ కోసం 24 వేల మంది సిబ్బందిని నియమించగా, కల్లాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించేందుకు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. ఈసారి రైతులకు రవాణా ఖర్చులు కూడా చెల్లించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా పంట దిగుబడులు, తద్వారా ధాన్యం సేకరణ అంచనాలు తగ్గినట్లు నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా సకాలంలో కొనుగోలు చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లుల సామర్థ్యం, చెల్లింపుల ప్రక్రియ వంటి అంశాల్లో పౌరసరఫరాల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన తర్వాత చెల్లింపులు ఆలస్యం కాకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం

కొత్తచెరువులో నూతన జడ్పీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చొరవతోనే జిల్లాకు పరిశ్రమలు వెల్లువెత్తున్నాయన్నారు. సత్యసాయి జిల్లాకు తాగునీరు, సాగునీరు అందించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావు, సీఎం చంద్రబాబు దే అని మంత్రి సవిత కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జడ్పీటీసీ స్థానాలను గెలుస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ విజయమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. టీడీపీ శ్రేణులు సమష్టిగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు.

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...
ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

ఓట్ల తొలగింపుపై బీజేపీ కుట్ర..
మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు

పుట్టిన పౌరులకు, గతంలో పలుమార్లు ఓటు వేసిన వారికి కూడా నోటీసులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని అన్నారు. నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జనం అతిపెద్ద పండుగల్లో ఒకటని మహేశ్ కుమార్ చెప్పారు. గణనాథుడిని సాగనంపుతూ రాష్ట్రం వ్యవసాయం, ఆరోగ్యం, విద్య సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కోరుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందాలని ఆకాంక్షించారు. మరోసారి ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్‌కు ఉండాలని కోరుకున్నామని చెప్పారు.

తెలంగాణలో ముగిసిన నైరుతి సీజన్ వర్షాలు..
రేపటి నుంచి దంచికొట్టనున్న ఎండలు!

ఈ రోజుల్లో రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నివేదిక హెచ్చరించింది. అక్టోబర్ మొదటి వారంలో మళ్లీ కాస్త ఉపశమనం లభించవచ్చని తెలిపారు. ఈశాన్య రుతుపవనాలకు ముందు వీచే తూర్పు గాలుల ప్రభావం వల్ల అక్టోబర్ 3 నుంచి 10వ తేదీ మధ్య దక్షిణ తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెదర్‌మ్యాన్ అంచనా వేశారు. అయితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మాత్రం ఈ ఏడాదికి ప్రధాన రుతుపవన వర్షాల కాలం సెప్టెంబర్ 26తో ముగిసినట్లేనని, ఆ ప్రాంతాల్లో ఇకపై సాధారణ పొడి వాతావరణమే ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఐరాస పట్ల వారికి నిజమైన శ్రద్ధలేదు
కేవలం దానిని వాడుకుంటున్నారు: జైశంకర్

ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు వ్యతిరేకించే వారికి దాని పట్ల నిజమైన శ్రద్ధలేదు

కేవలం వారు దానిని వాడుకుంటున్నారు- భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లి: ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు చేయకపోవడం వల్ల అంతర్జాతీయ సమాజంలో అసహనం పెరుగుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్ . జైశంకర్ అన్నారు. సంస్కరణలను వ్యతిరేకించేవారు ఐరాసను కేవలం వాడుకుంటున్నారని, దాని పట్ల వారికి ఏమాత్రం శ్రద్ధలేదని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూయార్క్ లో ఏటా జరిగే ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశం చర్చకు వస్తుందని, అయితే ప్రస్తుతం ఆ డిమాండ్ మరింత బలపడుతోందని ఆయన స్పష్టం చేశారు. ఐరాస సాధారణ సభ 81వ సమావేశాల సందర్భంగా అబర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ , రిలయన్స్ ఫౌండేషన్ , భారత్ లోని యూఎన్ కార్యాలయం, ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి బృందం- సంయుక్తంగా ఓ మంత్రుల స్థాయి సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశంలో పాల్గొన్న జైశంకర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "ఐరాస సంస్కరణల విషయంలో మనం నిజాయితీగా ఉంటే, కచ్చితంగా ఒక నిర్దిష్ట ముసాయిదా (టెక్ట్) ఆధారంగా చర్చలు జరపాలి. అలా చేయకపోతే అది చర్చ అనిపించుకోదు. కేవలం కాలహరణ మాత్రమే అవుతుంది. వాస్తవానికి నేటి యూఎన్ చాలా భిన్నంగా ఉండాలి. వాస్తవ ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా మరింత మారాలి. అంతర్జాతీయ సమాజం ఈ సంస్కరణలనే కోరుతోంది. ఇది ఐక్యరాజ్యసమితికి వ్యతిరేకించడం కాదు. నిజానికి దాని పట్ల శ్రద్ధ ఉన్న వారే దానిని సంస్కరించాలని కోరుకుంటారు. సంస్కరణలను వ్యతిరేకించేవారికి ఐరాస పట్ల నిజమైన శ్రద్ధలేదు. వారు దానిని కేవలం వాడుకుంటున్నారు" అని జైశంకర్ పేర్కొన్నారు.

అలా అయితే సంస్కరణలు చేయలేం!

ప్రస్తుత పరిస్థితుల్లో అందరి ఏకాభిప్రాయంతో ఐరాసలో సంస్కరణలు చేయడం సాధ్యం కాదని జైశంకర్ తేల్చిచెప్పారు. "ప్రజాస్వామ్యంలో మనం ఓటింగ్ జరిపి, మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటాం. ఎందుకంటే భిన్నమైన అభిప్రాయాలు ఉన్నవారు ఉంటారు. ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలు వెల్లడించే హక్కు ఉండాలి. ఆ తర్వాత ఓటింగ్ ద్వారా నిర్ణయం తీసుకోవాలి. అలాగే ఐరాసలో సంస్కరణల కోసం ఒక ముసాయిదా తప్పనిసరిగా ఉండాలి. దానిపై అందరి అభిప్రాయాలు సేకరించాలి. తద్వారా ప్రజాస్వామ్యబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనాలి" అని ఆయన స్పష్టం చేశారు.

పరస్పర సహకారం పెరుగుతోంది!

ప్రస్తుతం గ్లోబల్ సౌత్ దేశాల మధ్య పరస్పర సహకారం, పంచుకునే ధోరణి గణనీయంగా పెరిగిందని జైశంకర్ పేర్కొన్నారు. "ప్రస్తుతం చాలా దేశాలు ఒకదానితో ఒకటి మాట్లాడడానికి, కలిసి మరిన్ని పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇది చాలా మంచి పరిణామం. ఎందుకంటే ఇది పాతకాలపు పరస్పర ఆధారిత సంబంధాలను తొలగిస్తుంది. ప్రపంచం మరింత ప్రజాస్వామ్యయుతంగా మారుతుంది" అని జైశంకర్ అన్నారు.

ఐరాస సెక్రటరీ జనరల్ గా ఓ మహిళ?

తదుపరి ఐరాస సెక్రటరీ జనరల్ ఎంపిక విషయం గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. ఓ మహిళను యూఎన్ సెక్రటరీ జనరల్ గా నియమించాలనే ఆలోచన కింది స్థాయి నుంచి వచ్చిందని, ఇది పై స్థాయి నుంచి రుద్ధబడలేదని ఆయన స్పష్టం చేశారు. , ఐరాస సాధారణ సభలో జరిగిన ఉన్నత స్థాయి చర్చల సందర్భంగా ప్రపంచ నాయకులు ఓ పిలుపునిచ్చారు.

అహ్మదాబాద్ లో మంత్రి లోకేశ్ పెట్టుబడుల వేట వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టులకు కూడా ఏపీ అవకాశాలను వివరించారు. ఎనర్జీ స్టోరేజ్, గ్రీన్ మాలిక్యూల్స్ రంగాల్లో టొరెంట్ పవర్ విస్తరణ ప్రణాళికలకు అనుగుణంగా పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను రాష్ట్రంలో చేపట్టాలని సూచించారు. కంపెనీ విస్తరణ ప్రణాళికలను సమీర్ మెహతా లోకేశ్ కు వివరించారు. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని చేరుకోవడమే లక్ష్యమని ఏపీ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని చైర్మన్ సమీర్ మెహతా వెల్లడించారు. కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు : వెల్‌స్పన్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో చర్చల్లో కాకినాడలో బహుముఖ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు లోకేశ్ ప్రతిపాదన పెట్టారు. టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డీఐ పైపుల తయారీ, పైపు కోటింగ్, గ్రీన్ అమోనియా యూనిట్లను ఒకే వేదికపై ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని కోరారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా ఆహ్వానించారు. గత ఏడాది దావోస్‌లో చంద్రబాబుతో జరిగిన చర్చల్లో వచ్చిన ప్రతిపాదనల పురోగతిని ఇరువురు సమీక్షించారు. వెల్‌స్పన్ గ్రూప్ ఇప్పటికే రాష్ట్రంలో చేపట్టిన కార్యకలాపాలను నితిన్ జైన్ వివరించారు. కర్నూలు, కడప జిల్లాల్లో



100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును సంస్థ నిర్వహిస్తోందన్నారు. కాకినాడశ్రీకాకుళం గ్యాస్ పైప్‌లైన్ కోసం ఏపీజీడీసీకి, రిలయన్స్ కేజీ-డీ6 ప్రాజెక్టుకు పైపులను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్ : గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కనుభాయ్ జె.రక్కర్‌తో భేటీలో నెల్లూరులోని ప్రస్తుత ప్లాంట్ విస్తరణకు ప్రతిపాదన వచ్చింది. పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీలను ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. కృష్ణపట్నంలో రోజుకు 1,400 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన వంటనూనె రిఫైనరీ 2024 నుంచి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తోందని కనుభాయ్ రక్కర్ తెలిపారు. కాండ్ల, కృష్ణపట్నం, హల్దియా, మంగుళూరులో సంస్థకు ప్లాంట్లు ఉన్నాయని దక్షిణాది మార్కెట్ల కోసం మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. చిరిపాల్ గ్రూప్ ఎండీ బ్రిజ్ మోహన్ చిరిపాల్, గ్రూ సోలార్ సీఈఓ వినయ్ థదానితో జరిగిన సమావేశంలో విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ యూనిట్‌పై చర్చించారు. మౌలిక వసతులు, రోడ్డు కనెక్టివిటీ, విధానపరమైన మద్దతు వంటి అంశాలను లోకేశ్ వివరించారు. విశాఖలో పారిశ్రామిక ప్రాజెక్టులకు ఉన్న అనుకూలతలను తెలియజేస్తూ పెట్టుబడికి ఆహ్వానించారు. టైర్ల తయారీ యూనిట్‌పై ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని బ్రిజ్ మోహన్ చిరిపాల్ తెలిపారు. 52 దేశాలకుపైగా ఉత్పత్తులు : చిరిపాల్ గ్రూప్ కార్యకలాపాల విస్తృతిని బ్రిజ్ మోహన్ వివరించారు. నందన్ డెనిమ్, విశాల్ ఫ్యాబ్రిక్స్, నందన్ టెర్రీ వంటి వస్త్ర ఉత్పత్తులతో పాటు చిరిపాల్ పాలీఫిల్మ్, గ్రూ సోలార్, రసాయన ఉత్పత్తులను సంస్థ ఎగుమతి చేస్తోందన్నారు. 52కుపైగా దేశాలకు తమ ఉత్పత్తులు చేరుతున్నాయని తెలిపారు. తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జమ్మూ-కశ్మీర్‌లో ఇప్పటికే తయారీ యూనిట్లు ఉన్నాయని వెల్లడించారు.

కేసీఆర్ భూములపై విచారణకు ప్రత్యేక కమిటీ - 16 అంశాలతో జాబితా

మొదటి పేజీ తరువాయి

ఆయా గ్రామాల్లోని భూముల వివరాలను విచారణ అంశాల్లో చేర్చింది. వీరి ఆధీనంలోని భూముల్లో ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయి. వీటితో పాటు ఎసైన్డ్ , ఇతర భూముల అక్రమణలు, కొనుగోళ్లు జరిగాయన్న ఆరోపణల నిగ్గు తేల్చాలని విచారణ కమిటీకి నిర్దేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీచేశారు.

సంబంధిత జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణ

సంబంధిత జీవోను బుధవారం జారీ చేసినప్పటికీ ఇది గురువారం వెలుగులోకి వచ్చింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఎ.శ్రీదేవసేనను కమిటీ ఛైర్ పర్సన్ గా నియమించారు. స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీవ్ కుమార్ ఝాతోపాటు ఆయా భూములున్న జిల్లాలకు చెందిన కలెక్టర్ లు సభ్యులుగా ఉంటారు. తుది నివేదిక ఇచ్చేలోగా అంశాల తీవ్రతను అనుసరించి మధ్యంతర నివేదికలను సమర్పించాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. రంగారెడ్డి, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయి విచారణను ఈ కమిటీ చేపట్టనుంది.

విచారణ అంశాలు ఇవే

మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి, మర్కుక్ , శివారు వెంకటాపూర్ లోని భూములు. మాజీ మంత్రి హరీశ్ రావు, అతని కుటుంబ సభ్యులు, ఇతర భాగస్వాములకు సంబంధించి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని రంగనాయకసాగర్ జలాశయానికి సంబంధించిన భూములు, ఇతర అంశాలు, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామ పరిధిలోని భూములు. ఎం.హనుమంతరావు, 271 సర్వే నంబరులో కొనుగోలు చేసిన ఎసైన్డ్ భూములు - సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం వెలికట్ట గ్రామం. మల్లన్నసాగర్ నిర్మాణంలో భాగంగా సిద్దిపేట జిల్లాలో చేపట్టిన భూ సేకరణలో రోపణలపై మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి ఇచ్చిన పిర్యాదుతో విచారించనున్నారు. తొగుట మండలంలోని పల్లెపహాడ్ , తుక్కాపూర్ , ఏటిగడ్డ కిష్టాపూర్ , రాంపూర్ భూ సేకరణ జరిగిన ప్రాంతాల్లో విచారణ. మాజీ మంత్రి కేటీఆర్ , అతని కుటుంబసభ్యులు, భాగస్వాములు, శతభిష అగ్రో, ఇతర సంస్థలు, ఆయన వ్యక్తిగతంగా కొనుగోలు చేసిన రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం, జన్వాడ ప్రాంతాల్లో భూములు. మాజీ మంత్రి జి. జగదీశ్వర్ రెడ్డి, కుటుంబసభ్యులు, భాగస్వాములు - రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూరు. మాజీ ఎమ్మెల్యే పీ.రోహిత్ రెడ్డి, ఎసైన్డ్ భూముల కొనుగోళ్లు, అక్రమణలు - రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్ మండలం, అజీజ్ నగర్ గ్రామం. మాజీ మంత్రి గంగుల కమలాకర్ - ఇతరులు, ప్రభుత్వ భూముల అక్రమ కొనుగోలు, ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు - రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం బహదూర్ గూడ. ఇదే జిల్లా గండిపేట మండలం వట్టినాగుల పల్లిలోని శంకర హిల్స్ లో అక్రమ కొనుగోళ్ల ఆరోపణలపైనా. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతరులకు సంబంధించి భూదాన్ భూములు అక్రమ కొనుగోళ్ల ఆరోపణలు - రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం,



వట్టినాగులపల్లి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్ లో జరిగిన భూదాన్ భూముల కొనుగోళ్లు. మాజీ ఎమ్మెల్సీ ఎల్విన్ స్టీఫెన్ సన్ , లీజు భూముల క్రమబద్ధీకరణ - హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్ మండలం జీరా భూములు. ధరణి పోర్టల్ మాడ్యూళ్ల దుర్వినియోగంపై రాజ్ హైటెక్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ , రాజ్ పౌల్ట్రీ,ప్లాంటేషన్ , అగ్రికల్చర్ ఫామ్స్ , మనవిహా బ్రీడర్స్ ఎల్ ఎల్ పీ. (ఎం.హనుమంతరావు, ఎం.సుమన్ , టీ.మహేశ్ రావు, భాగస్వాములు) - మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం గండీడ్ . ప్రభుత్వ భూములు, ఎసైన్డ్ భూముల కొనుగోళ్ల తదితర అంశాలకు సంబంధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, సిరిసిల్ల తదితర మండలాల్లోని సర్దార్ పూర్, లక్ష్మీపూర్ , తంగళ్లపల్లి గ్రామాల్లో విచారణ నిర్వహించనున్నారు. మధ్య మానేరు జలాశయం ఆర్ ఆండ్ ఆర్ ప్యాకేజీలో అక్రమంగా పరిహారం పొందారన్న ఆరోపణలపై జోగినపల్లి రవీందర్ రావు. జె, సౌమ్యలకు సంబంధించి - రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి, ఇతర మండలాలు, జలాశయం భూ సేకరణ చేపట్టిన మన్వాడ తదితర గ్రామాల్లో విచారణ చేయనున్నారు.

బ్రహ్మోస్ క్షిపణి పాకిస్థాన్‌కు నిద్ర పట్టనివ్వడం లేదు: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి

అమిత్ షా చెప్పారు. 80దేశాలకు మన రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నట్లు తెలిపారు. అమేఠీలో తయారైన ఏకే-203 అసాల్ట్ రైఫిల్స్ ఉగ్రవాదుల భరతం పడుతున్నాయని అన్నారు. "దేశవ్యాప్తంగా రక్షణ ఉత్పత్తుల అభివృద్ధి జరిగింది. మన రక్షణ ఉత్పత్తి రూ.1,78,000 కోట్లను దాటింది. 2013-14తో పోలిస్తే రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో 56రెట్లు వృద్ధి సాధించాం. 80 దేశాలకు దేశ రక్షణ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. యూపీలో తయారైన బ్రహ్మోస్ పాకిస్థాన్ నిద్రను దూరం చేస్తోంది. ఇది మార్పుకు అతిపెద్ద సంకేతం. అమేఠీలో తయారైన ఏకే-203 అసాల్ట్ రైఫిల్ మావోయిస్టులు, ఉగ్రవాదులకు నిద్రను దూరం చేసింది." -అమిత్ షా,కేంద్ర హోంశాఖ మంత్రి

మోదీ విధానాల వల్లే ఈ మార్పు!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ఉన్న రాజకీయ స్థిరత్వాన్ని అమిత్ షా కొనియాడారు. వరుసగా మూడు పర్యాయాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న మోదీ, విధానాలను రూపొందించడమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా చూశారని చెప్పారు. అందువల్లే భారత్ గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్ తన వృద్ధి రేటును నిలబెట్టుకోవడమే కాకుండా దానిని మరింత వేగవంతం చేసిందని షా అన్నారు. 2047ఆగస్టు 15 నాటికి భారత్ అన్ని రంగాల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందన్న మోదీ సంకల్పం నిజమౌతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

'యోగి ప్రభుత్వ హయాంలో మాఫియాను తుదిముట్టించాం'

ఉత్తర్ ప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మాఫియాపై ఉక్కుపాదం మోపిందని అమిత్ షా ఉద్ఘాటించారు. మాఫియా శక్తులను తుదిచిపెట్టడానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని నొక్కి చెప్పారు. ఆపై, రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. 2017లో బీజేపీ అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ఆయన గుర్తు చేసుకున్నారు. "2013లో ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడానికి ఒక సదస్సును నిర్వహించింది. అయితే, లఖ్ నవూలోని శాంతిభద్రతల పరిస్థితి కారణంగా ఆ కార్యక్రమాన్ని దిల్లీలో నిర్వహించాల్సి వచ్చింది. ఎందుకంటే, లఖ్ నవూలో నెలకొన్న భయాందోళన పరిస్థితుల కారణంగా ఏ పెట్టుబడి దారుడు అక్కడికి రావడానికి సిద్ధంగా లేరని అప్పటి యూపీ అధికారులే స్వయంగా మీడియాతో చెప్పారు. అయితే, అప్పటి పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులతో పోల్చి చూస్తే ఎంతో మార్పు ఉంది. ప్రస్తుతం రాష్ట్రం భయ రహితంగా, పెట్టుబడులకు కేంద్రంగా, జాతీయ వృద్ధికి చోదక శక్తిగా మారిందని, ఆ ఘనత డబుల్ ఇంజిన్ సర్కార్‌దే. ఈ సానుకూల మార్పు వల్లే యూపీ ఇప్పుడు 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకోగలిగింది."

- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి ఒకప్పుడు ఉత్తర్‌ప్రదేశ్‌ను పాలించిన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీల పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అమిత్ షా ఎత్తి చూపారు. "ఒకప్పుడు ఇక్కడ ఎస్పీ, బీఎస్పీ పాలనలో ఒక 'క్రైమ్ ఇండస్ట్రీ' వర్ధిల్లేది. కానీ, 10 సంవత్సరాల తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వారి హయాంలో నెలకొన్న గూండాయిజాన్ని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టింది. అక్రమ పిస్టల్ తయారైన స్థానంలో, డిఫెన్స్ కారిడార్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల చోరీ జరిగిన ప్రాంతంలో వాహన తయారీ వచ్చింది. అలాగే, చైన్ స్నాచింగ్ జరిగిన చోట మెడికల్ డివైజ్ పార్కు వస్తోంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

మేక్ ఇన్ ఇండియాతో మార్పు స్పష్టంగా ఉంది'- ప్రధాని మోదీ పోస్ట్- కాంగ్రెస్ పార్టీ కౌంటర్

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులను ఆకర్షించడం, తయారీని పెంచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం ఆ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు. "భారత్‌లో మరింత తయారీ. భారత్‌లో మరింత పెట్టుబడి. భారత్ నుంచి మరింత ఎగుమతులు. వివిధ రంగాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని మోదీ పోస్టులో చెప్పారు. దేశం అభివృద్ధి చెందేందుకు అవసరమైన మౌలిక వసతులు, వ్యాపార అవకాశాలు, ఆవిష్కరణలను మేక్

రాయలసీమ దరువు APTEL/28/A7874 www.royaleseemadaruvu.com తెలుగు దినపత్రిక

శ్రీ సత్యసాయి జిల్లా ప్రగతి పథంలో మరో కీలక మైలురాయి

కొత్తచెరువు,సెప్టెంబర్ 25,దరువు న్యూస్ న్యూస్:శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల పరిపాలనను మరింత వేగవంతం చేస్తూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు సుపరిపాలన ఫలాలను నేరుగా చేరువ చేసే లక్ష్యంతో కొత్తచెరువులో తాత్కాలిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ భవనాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ వేడుకకు రాష్ట్ర బి.సి.,ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం మరియు చేనేత,జౌళి శాఖామంత్రి ఎస్.సవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్,రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత,పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూరా రెడ్డి కలిసి వేద మంత్రోచ్ఛారణల నడుమ రిబ్బన్ కట్ చేసి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి తాత్కాలిక భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూరా రెడ్డి సభాధ్యక్షత వహించారు.రాష్ట్ర మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ "జిల్లా ప్రజా పరిషత్ అనేది గ్రామీణాభివృద్ధికి వెన్నుముక వంటిది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా, తాగునీరు, పారిశుధ్యం మరియు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా అమలు



చేయడానికి ఈ తాత్కాలిక కార్యాలయం దోహదపడుతుంది" అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ "కొత్త జిల్లా ఏర్పాటు అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులకు అనువైన వాతావరణంలో సేవలందించేందుకు కొత్తచెరువులో సమగ్ర వసతులతో తాత్కాలిక జిల్లా ప్రజా పరిషత్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. గ్రామీణాభివృద్ధి,మౌలిక సదుపాయాల విస్తరణ, తాగునీటి సరఫరా మరియు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో జిల్లా ప్రజా పరిషత్ పాత్ర కీలకం.నూతన కార్యాలయం కేంద్రంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి" అని స్పష్టం చేశారు.పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి మాట్లాడుతూ కొత్తచెరువులో జిల్లా ప్రజా పరిషత్ భవనం అందుబాటులోకి రావడం ఈ నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. గ్రామీణ సేవలను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని అన్నారు.ప్రారంభోత్సవం అనంతరం మంత్రి,జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యేలు మరియు అధికారులు తాత్కాలిక భవనంలోని వివిధ శాఖల చాంబర్లు, కాన్ఫరెన్స్ హాల్, ప్రజాప్రతినిధుల సమావేశ మందిరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భవన నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థలను మెరుగ్గా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా భవన ప్రాంగణంలో మంత్రి,కలెక్టర్, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి,జిల్లా ప్రజా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి పి. విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ,జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో ఉలవల పంపిణీ

నంబులపూలకుంట,సెప్టెంబరు 25,దరువు న్యూస్ న్యూస్:ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా నంబులపూలకుంట మండలవ్యాప్తంగా రైతులకు 80 శాతం రాయితీపై ఉలవల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నంబులపూలకుంట గ్రామంలో ఈ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ మల్లెం శ్రీరాములు నాయుడు,క్లస్టర్ ఇన్‌చార్జ్ దండే రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలవ్యాప్తంగా మొత్తం 400 క్వింటాళ్ల ఉలవల విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.అర్హత కలిగిన ప్రతి రైతుకు



10 కిలోల నుంచి గరిష్ఠంగా 50 కిలోల వరకు విత్తనాలు అందజేస్తామన్నారు.10 కిలోల బస్తా ధర రూ.148గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.రైతులు పట్టాదారు పాస్‌బుక్,ఆధార్ కార్డుతో సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి అర్హత మేరకు ప్రత్యామ్నాయ విత్తనాలను పొందాలని సూచించారు.అలాగే పంట నమోదు ప్రక్రియలో భాగంగా ఈ నెలాఖరులోగా రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకే పంట నష్టం పరిహారం,పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారని తెలిపారు.ప్రధానమంత్రి కిసాన్ పథకం లబ్ధిదారుల్లో ఏపీఎఫ్ఆర్‌లో రైతు విశిష్ట సంఖ్య నమోదు కాని వారు వెంటనే నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సహాయకులు కృష్ణ నాయక్,హరిప్రసాద్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

స్త్రీశక్తికి తగ్గట్టుగా 4 వేల కొత్త బస్సులు

దరువు న్యూస్:పుట్టపర్తి, సెప్టెంబరు 25: స్త్రీశక్తి పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తక్షణమే 4 వేల కొత్త బస్సులను సమకూర్చాలని ఏపీ పీ.టి.డి. (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్సులు, సిబ్బంది సంఖ్యను పెంచకుండా ప్రయాణికుల సంఖ్య మాత్రమే పెరిగితే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. దీనివల్ల మంచి ఉద్దేశంతో అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకానికే చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పుట్టపర్తిలోని అబ్దుల్ కలాం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ పీ.టి.డి. (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ విస్తృతస్థాయి జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు జి.వై.పి.రావు అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి కుంచపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పలిశెట్టి దామోదరరావు హాజరై మాట్లాడారు. స్త్రీశక్తి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు, సర్వీసులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో పాటు వారు సురక్షితంగా, సౌకర్యవంతంగా, సమయానికి గమ్యస్థానాలకు చేరేలా తగినన్ని బస్సులు అందుబాటులో ఉంచినప్పుడే పథకం లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రస్తుతం పరిమిత బస్సులు, సిబ్బందితో పెరిగిన ప్రయాణికుల రద్దీని నిర్వహించాల్సి రావడంతో ఆర్టీసీ ఉద్యోగులపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. కొన్ని సర్వీసుల్లో అధిక రద్దీ కారణంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు, సిబ్బందిని సమకూర్చడమే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. 15



వేల ఖాళీలను భర్తీ చేయాలి ఆర్టీసీలో ఖాళీగా ఉన్న స-ుమారు 15 వేల పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందితో పాటు అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీయే నడపాలి

అవసరమైన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి, ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను చేపడితే ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలను పునఃప్రారంభించాలని కోరారు.

ఇ.యు. రాష్ట్ర కార్యదర్శి సి. నబీరసూల్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత సర్క్యులర్ 01/2019ను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. కడప జోన్ జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ పదోన్నతులపై కొనసాగుతున్న నిలుపుదలను సడలించి అర్హులైన ఉద్యోగులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 400 మంది ఉద్యోగుల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇ.యు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.బి. నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రానున్న సీసీఎస్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జోనల్ నాయకులు ఎన్.సి. శేఖర్, ఎం. బాబయ్య, హెచ్. అరుణమ్మ, జిల్లా నాయకులు ఎన్. నారాయణస్వామి, డి.వి. రమణప్ప, బి. నరసింహులు, బి. ఆదినారాయణ, ఎస్. శంకరప్ప, వెంకటేష్, సి. లక్ష్మీకాంతమ్మ, ఆర్. విజయలక్ష్మి, జి. వెంకటలక్ష్మితో పాటు ఆరు డిపోల ట్రాఫిక్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా కార్యకర్తలు, జిల్లా కమిటీ సభ్యులు, సుమారు 300 మంది ఇ.యు. ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్‌లో 20 మంది చేరిక

సమావేశం సందర్భంగా హిందూపురం డిపో ఎన్ఎంయూ అసోసియేషన్‌కు చెందిన 14 మంది, పుట్టపర్తి డిపో నుంచి ఇద్దరు, కదిరి డిపో నుంచి ముగ్గురు, మడకశిర నుంచి ఒకరు చొప్పున మొత్తం 20 మంది సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు సమక్షంలో ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు.

ఘనంగా పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు

కదిరి,సెప్టెంబర్25,దరువు న్యూస్ న్యూస్:భారతీయ జనసంఘ్ ప్రముఖ నాయకుడు, గొప్ప ఆలోచనాపరుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరి అసెంబ్లీ లో పార్టీ ఆఫీసు నందు జయంతి నీ జరుపుకొన్నాము.1916 సెప్టెంబర్ 25న జన్మించిన దీనదయాళ్ ఉపాధ్యాయ గారు చిన్న వయసులోనే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, దేశ సేవను తన జీవిత లక్ష్యంగా చేసుకున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ద్వారా ప్రజా సేవలోకి వచ్చి, భారతీయ జనసంఘ్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు.దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనల్లో అత్యంత ముఖ్యమైనది "ఏకాత్మ మానవతావాదం".మన దేశ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి మాత్రమే కాదు,సమాజంలోని ప్రతి వ్యక్తి గౌరవంగా,స్వయం సమృద్ధిగా జీవించే పరిస్థితులు ఏర్పడాలని ఆయన భావించారు. అలాగే "అంత్యోదయ" భావనకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలి,పేదలు, వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇవ్వాలి అనేది ఆయన ఆలోచనలలో ప్రధాన అంశం.ఈరోజు మనం



దీనదయాళ్ ఉపాధ్యాయ ని స్మరించుకోవడం అంటే కేవలం ఆయన చిత్రపటానికి పూలమాల వేయడం కాదు.ఆయన చూపిన దేశభక్తి,సేవా భావం, నిస్వార్థ జీవితం, సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతిపై ఉన్న దృక్పథాన్ని మన జీవితాల్లో ఆచరించాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదలు, రైతులు,మహిళలు, యువత,వెనుకబడిన వర్గాలు మరియు అట్టడుగు వర్గాల కోసం అనేక సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది.అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరాలనే ఆలోచనను ప్రజా జీవితంలో ముందుకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత.ముఖ్యంగా బీసీ వర్గాల సాధికారత కోసం విద్య, ఉపాధి,నైపుణ్యాభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాలు పెరగాలని మనం కృషి చేయాలి. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన అంత్యోదయానికి మార్గం.దీనదయాళ్ ఉపాధ్యాయ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది,దేశం కోసం పనిచేయాలి,సమాజం కోసం పనిచేయాలి, స్వార్థం లేకుండా ప్రజలకు సేవ చేయాలి. ఈ పవిత్రమైన రోజున దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతికి మన వంతు కృషి చేయాలని మనమందరం ప్రతిజ్ఞ చేద్దాం.పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ కి ఘన నివాళులు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ఉత్తమ రెడ్డి, వెంకటేష్,గిరిజన మోర్చా ప్రధానకార్యదర్శి హరీ నాయక్,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి హసనాపురం చంటి, మీడియా జిల్లా ఇంచార్జ్ డీ.ఎల్.ఆంజనేయులు,జిల్లా ఉపాధ్యక్షులు కె. గిరిజమ్మ,మేకల నాగార్జున,బెల్లాల్ ఉత్తమ రెడ్డి,మైనార్టీ నాయకులు ఇంతియాజ్,మాజీ కౌన్సిలర్ మైనుద్దీన్, ఎర్రం శెట్టి రమేష్ బాబు,ఆలీ,నంది శెట్టి బాబు,శివ రెడ్డి, రంగారెడ్డి,రవిచందర్ నాయుడు,ఇబ్రహీం, జనార్ధన్ దేవానంద్ కాలనీ శ్రీనివాసులు, మంజునాథ్ రెడ్డి,ఆవుల శ్రీనివాసులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక జ్ఞానానికి క్షేత్రస్థాయి అనుభవం



నంబులపూలకుంట,సెప్టెంబరు 25,దరువు న్యూస్ న్యూస్:నంబులపూలకుంట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యలో భాగంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం,ఎలక్ట్రానిక్స్,హార్డ్‌వేర్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు పవర్‌గ్రిడ్,సౌర విద్యుత్ సంస్థలను సందర్శించారు.ఈ సందర్భంగా కంప్యూటర్ వినియోగం,సమాచార నమోదు,సాంకేతిక విధానాలపై విద్యార్థులు ప్రత్యక్ష అవగాహన పొందారు.సంస్థ సిబ్బంది వివిధ సాంకేతిక అంశాలను వివరించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.పాఠ్యాంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానం పెరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు.ప్రధానోపాధ్యాయులు జి.మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు జె.సురేంద్రబాబు,కె.బాబా ఫకృద్దీన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా దీన్ దయాల్ జయంతి వేడుకలు



మడకశిర,సెప్టెంబర్ 25,దరువు న్యూస్ న్యూస్:మడకశిర మండలం బుల్లసముద్రం లోని 209,210 బూత్ లో పండిత్ దీన్ దయాల్ 110 వ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.భారతీయ జనసంఘ్ పూర్వ జాతీయ అధ్యక్షులు ఏకాత్మత మానవతావాద సిద్ధాంతకర్త అంత్యోదయ లక్ష్యంగా నవ భారత నిర్మితమవ్వాలని పార్టీకి దిశ నిర్దేశం చేసిన దివంగత పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ 110 వ జయంతి సందర్భంగా 209 మరియు 210 బుతుల్లో పండిట్ దిన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అయన సేవలను బిజెపి రాష్ట్ర నాయకులు సింగల్ విండో డైరెక్టర్ చంద్రశేఖర్ కొనియాడారు.పండిత్ దీన్ దయాల్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. భారతీయ జనసం వ్యవస్థాపకులు శ్రీ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవనశైలి యావత్ భారతీయులకు ప్రేరణదాయకం అంత్యోదయం సిద్ధాంతాన్ని మొట్టమొదటిగా ప్రవేశపెట్టింది అయ-నేనని అంత్యోదయమంటే కులమతాలకతీతంగా చిట్టచివరి మనిషికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాల అన్నదే ఆయన లక్ష్యమని పేర్కొన్నారు.ఆయనలాగా ప్రతి ఒక్కరూ జాతీయ వాదం మానవతావాదం అలవర్చుకోవాలి ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే అనుమానాస్పద స్థితిలో అయినా మృతదేహం రైల్వే ట్రాక్ పక్కన లభ్యమయిందని ఆయన మరణించినా కూడా మా అందరి మనసుల్లో పండిత్ దీన్ దయాల్ ఉన్నారని ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగిస్తామని తెలియజేశ-ారు.ఈకార్యక్రమంలో నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు, బూత్ మెంబర్లు రవీంద్ర,శశికుమార్.గంగమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు..

నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన



నంబులపూలకుంట,సెప్టెంబరు 25,దరువు న్యూస్ న్యూస్:నంబులపూలకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ బాలాజీ నాయక్ విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే ఇబ్బందులు,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.పరిశుభ్రత పాటించడం,భోజనం చేసే ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం,గోళ్లను క్రమం తప్పకుండా కత్తిరించుకోవడం వంటి అలవాట్లను విద్యార్థులు పాటించాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శుభ్రమైన ఆహారం,నీటిని తీసుకోవడం ద్వారా నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు.అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ,వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ,తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని డాక్టర్ బాలాజీ నాయక్ సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు..

తిరుపతిలో 76 గంటల డప్పు నాదానికి సన్నాహాలు



నంబులపూలకుంట సెప్టెంబరు 25,దరువు న్యూస్ న్యూస్:బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరంలో అక్టోబర్ 4, 5,6 తేదీల్లో 76 గంటల పాటు నిరంతర డప్పు నాద కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినం,25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శ్రీ సత్యసాయి జిల్లా డప్పు కళాకారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.నంబుల పూలకుంట మండలానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు జయరామ్ గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామానికి చెందిన డప్పు కళాకారులతో సమావేశమై కార్యక్రమ వివరాలను తెలియజేశారు.తిరుపతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో కళాకారుల భాగస్వామ్యం,కార్యక్రమ నిర్వహణ,సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని జయరామ్ సూచించారు.సమావేశంలో కటారుపల్లి గ్రామానికి చెందిన డప్పు కళాకారులు పాల్గొన్నారు.

రాయలసీమ దరువు APTEL/28/A7874

మడకశిర అర్బన్ సీఐగా శివరాం



మడకశిర, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

మడకశిర అర్బన్ సీఐగా శివరాం శుక్రవారం తన పదవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఓ కృష్ణారెడ్డి పోలీస్ సిబ్బంది కలసి స్వాగతం పలికారు. ఒక్కొక్కరే నూతన సీఐతో పరిచయం చేస్కున్నారు. అనంతరం వారు పూలబొకేనందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అర్బన్ సీఐగా బాధ్యతలను స్వీకరించిన శివరాం మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎన్.సతీష్ కుమార్ ఆదేశాలమేరకు మడకశిర అర్బన్ పరిధిలో పేకాట, మట్కా కర్నాటక మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, ఇసుక మాఫియా తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలనకు గట్టి చర్యలు చేపట్టనున్నట్లు అయన వెల్లడించారు. శాంతి భద్రతలు పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు తమవంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాల్సిందిగా అర్బన్ సీఐ శివరాం కోరారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించండి



గుడిబండ, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

మండల పరిధిలోని కేకేపాలెం నుండి మద్దనకుంట మీదుగా కురుబరపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆ మూడు గ్రామాల ప్రజలు అధికారులను ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ద్విచక్ర వాహనదారులు కానీ పాదాచారులు కానీ ఆ రోడ్డులో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. గుడిబండ నుండి మోరుబాగల్ కు పోవు ప్రధాన రహదారిలోని మద్దనకుంట నుండి కురుబరపల్లికి పోవు రహదారి ముళ్లపొదలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మద్దన కుంట నుండి కేకే పాల్యం పోవు రహదారి ముల్లకంప చెట్లుపొదలుగా ఏర్పడి రోడ్డు ఇరుకుగా మారింది. ఆ రోడ్డు ఇటుకలపల్లి బరు గూరు ప్రధాన రహదారులను కలిపే మార్గాలు అధికారులు స్పందించి ఆ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళకంప చెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీట్ పీజీలో బుక్కపట్నం బిడ్డ సత్తా

జాతీయస్థాయిలో 1,343వ ర్యాంకు సాధించిన పాముదుర్తి విద్యార్థిని లీలా సంజు



బుక్కపట్నం, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయస్థాయి వైద్య ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన జి. లీలా సంజు నీట్ పీజీ-2026లో జాతీయస్థాయిలో 1,343వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటుకుంది. ఈ విజయంతో పాముదుర్తి గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పాముదుర్తి గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, జ్యోతి దంపతుల కుమార్తె అయిన లీలా సంజు తిరుపతిలోని పద్మావతి వైద్య కళాశాలలో వైద్య విద్యను అభ్యసించింది. చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న ఆమె పట్టుదలతో విద్యనభ్యసించి నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయిలో మంచి ర్యాంకు సాధించింది. లీలా సంజు సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, మిత్రులు ఆమెను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తన విజయంపై లీలా సంజు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత స్థాయి వైద్యురాలిగా ఎదిగి గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తన విజయానికి తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతో తోడ్పడిందని పేర్కొన్నారు. తమ కుమార్తె జాతీయస్థాయిలో 1,343వ ర్యాంకు సాధించడం ఎంతో గర్వంగా ఉందని తల్లిదండ్రులు కృష్ణమూర్తి, జ్యోతి తెలిపారు. లీలా సంజు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

యువత భవితకు భరోసా.. నైపుణ్యాలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు





అనంతపురం, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

అనంతపురంలోని పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నేడు యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఉన్నత విద్య, కెరీర్ ప్రణాళిక, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'యువత భవితకు భరోసా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ లక్ష్మీనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి సరైన దిశలో కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వేగంగా మారుతున్నాయని, అందుకు అనుగుణంగా యువత నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం యువత కోసం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి పథకాలు, అవకాశాలపై అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 'నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. యువతకు సరైన విద్య, నైపుణ్యాలు, అవకాశాలు, మార్గదర్శకత్వం అందిస్తే వారు తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడమే కాకుండా దేశ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తారు' అని పేర్కొన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలు, ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులు, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భవిష్యత్తులో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యార్థి దశ నుంచే సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించిన ఈ కార్యక్రమం యువతకు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన పట్ల ఆసక్తిని పెంపొందించేలా విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, శ్రీ బాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సుబ్బారావు, బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. ప్రదీప్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ ప్రధాన కమిషనర్ గ్యానేష్‌ని వెంటనే అరెస్ట్ చేయాలి

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనమల



అనంతపురం, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ని వెంటనే అరెస్టు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనమల డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ యనమల మాట్లాడుతూ.. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పిలవబడుతున్న భారతదేశంలో స్వేచ్ఛా యుతమైన, నిష్పక్షపాతమైన, పారదర్శక ఎన్నికల వ్యవస్థ ఈ దేశానికి ప్రాణం వంటిదని, అలాంటి ఎన్నికల వ్యవస్థని నిర్వీర్యం చేసేవిధంగా ఏకపక్ష ధోరణిలో నిర్ణయాలు తీసుకుంటూ ఎన్నికల వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని భారత ఎన్నికల కమిషనర్ బ్రష్టు పట్టించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంగ్ల పత్రికలో 2 రోజుల క్రితం ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్ ప్రచురించిన వ్యాసం దేశాన్ని కుదిపేసిందన్నారు. గత కొంతకాలం రాహుల్ గాంధీ ఓట్ దొంగతనం గురించి అనేక సందర్భాలలో మాట్లాడుతుందని, నిన్నటి రోజున ఆంగ్ల పత్రికలో ప్రచురించిన వ్యాసం రాహుల్ గాంధీ ఆరోపణలకు బలం చేకూర్చిందన్నారు. ఎన్నికల కమిషన్‌లో ఉన్న ముగ్గురు సభ్యులలో, ఇద్దరు సభ్యులు గ్యానేష్ కుమార్ తీలుకుంటున్న, అవలంభిస్తున్న ఏకపక్ష ధోరణిపై తిరుగుబాటు చేస్తూ దాదాపు 14 సార్లు వారి అభ్యంతరాలని తెలపారన్నారు. ఇంతలా బరితెగించి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్న ఈసీఐ గ్యానేష్ కుమారుని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాహుల్ గాంధీ నాయకత్వంలో మరో జెన్ జెడ్ తిరుగుబాటు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎనఎస్‌యఐ జిల్లా అధ్యక్షులు ఓబీలేసు, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్

లక్ష్య సాధనలో శ్రీ సత్యసాయి జిల్లా ముందంజ

మహిళా సంఘాల ద్వారా కుటుంబాల జీవనోపాధికి బాసట

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మునిసిపల్ కమీషనర్ మల్లికార్జున





హిందూపురం, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త.. ప్రతి కుటుంబానికి మెరుగైన జీవనోపాధి.అనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో వన్ ఫ్యామిలీ వన్ ఇంటెప్రెన్యూర్ కార్యక్రమం ముందుకు సాగుతోంది. మహిళలు కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులుగా మాత్రమే కాకుండా స్వయం ఉపాధి పొందుతూ వ్యాపారవేత్తలుగా ఎదిగి, తమ కుటుంబాలకు ఆర్థికంగా బాసటగా నిలవడంతోపాటు, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో మెప్మా ద్వారా వివిధ జీవనోపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాలు అమలు అవుతున్నాయనీ శుక్రవారం పట్టణంలోని సెంటర్లో పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో శ్రీ సత్య సాయి జిల్లా మెప్మా విశేష ప్రగతి నమోదు చేసింది. 2026-27 సంవత్సరానికి సంబంధించిన 96.27 శాతం ప్రగతి సాధించి రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచింది.

మహిళ ఎదిగితే.. కుటుంబం ఎదుగుతుంది

మెప్మా ద్వారా మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి, సూక్ష్మ పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, రుణ అనుసంధానం, మార్కెట్ అవకాశాలు వంటి అంశాల్లో సహకారం అందిస్తూ కుటుంబాల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున అన్నారు. ఒక మహిళ తన కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చుకునే స్థాయి నుంచి తనకే కాకుండా మరొకరికి కూడా ఉపాధి కల్పించే వ్యాపారవేత్తగా ఎదగడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశంగా నిలుస్తోంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారం, శాఖాపరమైన మార్గదర్శకత్వంతో పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు, పట్టణ పేద కుటుంబాలకు జీవనోపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలు మరింత చేరువవుతున్నాయి. మెప్మా ఎండీ కరుణ మార్గదర్శకత్వం, కార్యాచరణ ప్రణాళికలు, సలహాలు మరియు సూచనలతో మహిళా సంఘాల జీవనోపాధి మెరుగుదల, స్వయం ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. నాగరాజు నాయకత్వం, పర్యవేక్షణ,

మార్గదర్శకత్వంతోపాటు వాసుదేవ రెడ్డి క్షేత్రస్థాయి సమన్వయం, హిందూపురం డీఎంసీ ఎల్.గంగులయ్య సమన్వయ కృషి ఈ ప్రగతికి బలంగా నిలిచాయి. అదేవిధంగా ఆర్‌పిలు, సిఓలు, డిఇఓలు, క్షేత్రస్థాయి సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షులు సుజాతమ్మ, సరస్వతమ్మ తదితరులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్యక్రమాల పురోగతికి సహకరించారు.

జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేక అధికారి

శ్యామ్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ.. ఇకపై అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



పుట్టపర్తి, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

శ్రీ సత్యసాయి జిల్లా ప్రజా పరిషత్ పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికైన సభ్యుల సాధారణ పదవీకాలం గురువారంతో ముగియడంతో, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఏ. శ్యామ్ ప్రసాద్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్ పాలకవర్గ పదవీకాలం 24-09-2026తో ముగిసిన నేపథ్యంలో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జిల్లా పరిషత్ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 129, తేదీ 19-09-2026 ద్వారా జిల్లా కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌ను జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల అవసరాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తాగునీరు, రహదారులు, ప్రాథమిక విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పాలకవర్గ పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా జిల్లా పరిషత్ పరిపాలన కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ నిధులను పూర్తి పారదర్శకతతో ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తామని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌కు కొత్త చిరునామా



- కొత్తచెరువులో తాత్కాలిక కార్యాలయం ఘన ప్రారంభం.. గ్రామీణ ప్రగతికి కీలక కేంద్రంగా జిల్లా పరిషత్
- సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రజలకు పాలన మరింత చేరువ చేస్తాం.. మంత్రి ఎస్.సవిత
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి.. కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, సెప్టెంబర్ 25, దరువు న్యూస్ :

శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటైన తర్వాత స్థానిక సంస్థల పరిపాలనకు మరింత ఊతమిస్తూ కొత్తచెరువులో ఏర్పాటు చేసిన జిల్లా ప్రజా పరిషత్ తాత్కాలిక కార్యాలయం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి వేద మంత్రోచ్ఛారణల నడుమ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పనిచేస్తోందన్నారు. నూతన జిల్లా ఏర్పాటైన అనంతరం ప్రత్యేకంగా జిల్లా పరిషత్ కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల పరిపాలనా కార్యకలాపాలు మరింత సులభతరం కావడంతో పాటు గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ అవుతాయని తెలిపారు. గతంలో ఉమ్మడి జిల్లాలోనే జిల్లా పరిషత్ కార్యాలయాలు ఉండేవని, ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రత్యేక కార్యాలయం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. కొత్త కార్యాలయంలో సుమారు 47 మంది అధికారులు విధులు నిర్వహించనున్నారని, దీనివల్ల జిల్లా పరిషత్ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. త్వరలోనే జిల్లాకు అవసరమైన ఇతర కార్యాలయాల నిర్మాణాలను కూడా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో తాగునీటి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని, కియా వంటి అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలతో పాటు గోల్లపల్లి జలాశయం వంటి కీలక వనరులను సమర్థంగా వినియోగించుకుని మరిన్ని పెట్టుబడులు, పరిశ్రమలను ఆకర్షించేలా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పాటైన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు అనువైన వాతావరణంలో సేవలందించేందుకు సమగ్ర వసతులతో జిల్లా ప్రజా పరిషత్ తాత్కాలిక కార్యాలయం అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, తాగునీటి సరఫరా, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో జిల్లా ప్రజా పరిషత్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి మాట్లాడుతూ కొత్తచెరువులో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం అందుబాటులోకి రావడం పుట్టపర్తి నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యాలయ ప్రారంభం అనంతరం మంత్రి సవిత, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యేలు, అధికారులు కార్యాలయంలోని వివిధ విభాగాలను, సమావేశ మందిరాలను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సమర్థవంతంగా స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మంత్రి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణాధికారి పి. విజయలక్ష్మి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.